www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -205 గురువారం 12 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

ఏ ఒక్కరికీ నష్టం లేకుండా మూసీ పునరుజ్జీవం

హైడ్రా పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన ముఖ్యమంత్రి

చెరువుల చెర విడిపిస్తాం.. ఇక తమ్మిడికుంట ఫేమస్

భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందంటే..

కొందరికి నష్టం జరిగినా ఓకే: రేవంత్ రెడ్డి

మూసీ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికీ ఆహ్వానించాలి

పనులు పూర్తిచేసే శక్తి దేవుడు మీకివ్వాలి: నాగార్జున



హైదరాబాద్ సిటీ, నవంబర్ 11(ప్రజావినికిడి):

"మూసీ ప్రక్షాళన చేయాల్సిందే. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా ఆ నది పునరుజ్జీవ ప్రాజెక్టును చేపడతాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందుకు రాజకీయాలకతీతంగా సహకరించాలని.. అందరూ ఒకే వేదికపైకి రావాలని ఆయన కోరారు. 55 కిలోమీటర్ల మేర ఉన్న మూసీ ప్రక్షాళనలో భాగంగా.. 21 కిలోమీటర్ల మేర పనులకు అన్ని అనుమతులూ వచ్చాయని, త్వరలో పనులు మొదలు పెడతామని ఆయన తెలిపారు. ఐటీ కారిడార్‌లో రూ. 20 కోట్లతో హైడ్రా పునరుద్ధరించిన**మిగతా 2లో...**

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

రబీ 2026-27 సీజన్‌కు కేంద్ర కేబినెట్ ఆమోదం

రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులు..

అంతర్జాతీయ ధరల భారాన్ని తగ్గించే చర్యలు

యుగే యుగేన్ భారత్ మ్యూజియం నిర్మాణానికి రూ.3,230 కోట్లు

'స్టాండ్ అప్ ఇండియా' కు రూ.4,111 కోట్లు : కేంద్ర మంత్రి వర్గ నిర్ణయాలు



న్యూఢిల్లీ నవంబర్ 11 (ప్రజావినికిడి):

రైతులకు అందుబాటు ధరల్లో ఎరువులను అందించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఆర్థిక చేయూతనిచ్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 202627 రబీ సీజన్‌కు ఎరువుల సబ్సిడీగా రూ.62,370 కోట్లను కేటాయించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువులు, వాటి తయారీకి అవసరమైన ముడి పదార్థాల ధరల్లో మార్పుల నేపథ్యంలో రైతులపై ఆర్థిక భారం పడకుండా ఈ చర్య చేపట్టినట్లు కేంద్రం**మిగతా 2లో...**



వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

తెలంగాణ విద్యా వ్యవస్థలో భారీ మార్పులు..

అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు ప్రాధాన్యం

12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ

హైదరాబాద్ నవంబర్ 11(ప్రజావినికిడి):

రాష్ట్ర విద్యా వ్యవస్థలో భారీ మార్పులకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పాఠశాల విద్యలో 10+2 విధానాన్ని అమలు చేయాలని**మిగతా 2లో...**

సంక్షేమం ఆగమైంది

కాంగ్రెస్ అసమర్థ పాలనతో ప్రజలకు కష్టాలు

- పంట పొలాలకు నీరు నిలిపేశారు

- ఇతర రాష్ట్రాలకు కరువు బృందాలు.. తెలంగాణకు మొండి చేయి

- 8 మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉండి ఏం లాభం?

- ప్రధాని మోడీ ఇంటి ఎదుట ధర్నా చేయాలి: కేటీఆర్

నిర్మల్: నవంబర్ 11(ప్రజావినికిడి):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతో ప్రజల సంక్షేమం కుంటుపడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు కరువు అంచనా బృందాలను పంపుతున్నప్పటికీ తెలంగాణకు పంపకుండా వివక్ష**మిగతా 2లో...**





వాటర్ రెగ్యులేటరీ

సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష..

రెండున్నర ఏళ్లలో 36 ప్రాజెక్టులను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

ఎత్తిపోతల పథకాలను జలహారతి కార్పొరేషన్ ద్వారా పర్యవేక్షించాలని సూచన

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు అంశంపై అధ్యయనం చేయాలని ఆదేశం

అమరావతినవంబర్ 11 (ప్రజావినికిడి):

ఏపీలో సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల ప్రస్తుత పరిస్థితిపై ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి జలవనరుల శాఖ**మిగతా 2లో...**

సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్ర దాడి

బైక్‌పై వచ్చి 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు

ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలు

వారిలో ఇద్దరి పరిస్థితి విషమం

కశ్మీర్‌లోని కుల్గాంలో ఘటన



జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో హైదరాబాద్‌కు జాతీయ గుర్తింపు

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్



న్యూఢిల్లీ:నవంబర్ 11(ప్రజావినికిడి):

స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26 జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) జాతీయ అవార్డును అందుకుంది**మిగతా 2లో...**

విజయసాయిరెడ్డి.. కొత్త పార్టీ పీఆర్పీ

పరివర్తన రాజనీతి పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి

ఏపీ రాజకీయాల్లోకి మరో కొత్త వేదిక



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఏ ఒక్కరికీ నష్టం లేకుండా మూసీ పునరుజ్జీవం

మొదటిపేజీ తరువాయి

తమ్మిడికుంటను.. సినీనటుడు అక్కినేని నాగార్జున, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆయన.. ప్రపంచంలో ఎక్కడైనా నదీ పరీవాహక ప్రాంతాల్లో అభివృద్ధి జరిగిందని, అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా వంటి దేశాలు నదుల తీర ప్రాంతాలను పర్యాటక, ఆర్థిక చోదక శక్తులుగా తీర్చిదిద్దాయని పేర్కొన్నారు. అదే తరహాలో హైదరాబాద్, తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవాలన్నదే తన ఆలోచన అని స్పష్టం చేశారు. 'నా సంకల్పం మంచిదైనప్పుడు.. నేను చేసే పని భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతున్నప్పుడు. కొందరికి నష్టం జరుగుతుందని ఎందుకు వెనక్కి తగ్గాలి' అని ప్రశ్నించారు. జెటర్ లోపల ఉన్న 1.34 కోట్ల మందితోపాటు.. నల్గొండ జిల్లాలోని 30 లక్షల మంది మూసీ కాలుష్యంతో ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరముందని రేవంత్ అభిప్రాయపడ్డారు. మెడికల్, ఇతర వ్యర్థాల డంపింగ్ కేంద్రంగా మూసీ నది మారిందని, ఈ పరిస్థితిని పూర్తిగా మార్చి ఆ నదిని ప్రజలకు ఉపయుక్తంగా, రాష్ట్ర ఆదాయానికి చోదక శక్తిగా తీర్చిదిద్దుతామఇ చెప్పారు. అలాగే..



హైదరాబాద్‌లో చెరువుల చెర విడిపించాల్సిందేనని, కబ్జాదారుల నుంచి విముక్తి కల్పించాల్సిందేనని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

బతుకమ్మకుంట, సున్నం చెరువు, నల్ల చెరువు, ఫాక్స్ సాగర్, మియాపూర్ చెరువు తదితర 20 చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. తమ్మిడికుంటను అభివృద్ధి చేయాలని నిర్ణయించినప్పుడు కొంత ఇబ్బందికరమైన పరిస్థితి తలెత్తిందని, ప్రభుత్వపరంగా తీసుకున్న నిర్ణయాలు చిరకాల పరిచయమున్న నాగార్జున, ఇతర మిత్రుల మనసుకు కష్టంగా అనిపించాయని.. సర్కారు నిర్ణయం వల్ల వారికి కొంత నష్టం కూడా జరిగిందని ఆయన వెల్లడించారు. అయితే, కొందరికి నష్టం జరిగినా.. కొన్ని తరాలకు మంచి జరుగుతుందన్న ఆలోచనతోనే చెరువుల పునరుద్ధరణ, పునరుజ్జీవానినికి శ్రీకారం చుట్టామన్నారు. పెద్ద మనసుతో ఈ విషయాన్ని అర్థం చేసుకొన్న నాగార్జున రెండెకరాల స్థలాన్ని ఉదారంగా ఇచ్చి.. సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలో హీరో అని నిరూపించుకున్నారన్నారు. ఎక్కడో షూటింగ్‌లో ఉన్న ఆయన.. ప్రభుత్వం తరఫున ఆహ్వానిస్తే.. ప్రత్యేకవిమానంలో వచ్చారని చెప్పారు. నాగార్జున నిజమైన హైదరాబాదీ అని, ప్రకృతి పరిరక్షణకు ఆయన ఎప్పుడూ ముందుంటారని రేవంత్ ఆకాంక్షించారు.

వాటితోపాటు..ఇప్పటి వరకు హైటెక్ సిటీ, శిల్పారామం, హైటెక్స్ గురించి మాత్రమే మాట్లాడుకున్నారని, మూడింటి మధ్య ఉన్న తమ్మిడికుంట గురించి మాట్లాడేలా దాన్ని అభివృద్ధి చేశామని సీఎం తెలిపారు. ఐటీ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోం కాదు.. వర్క్ ఫ్రం తమ్మిడికుంట చేసేలా ఏర్పాట్లు చేయాలని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్, సీఎంసీ కమిషనర్ సృజనలకు సూచించారు. ఈ సందర్భంగా రామంతాపూర్ పెద్ద చెరువులో గుడిసెలు ఇళ్లు కోల్పోయిన 34 మందికి నాచారం-మల్లాపూర్ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు పత్రాలు అందజేశారు.

ఎరువుల సబ్సిడీకి రూ.62,370 కోట్లు

మొదటిపేజీ తరువాయి

వెల్లడించింది.రబీ 202627 సీజన్‌కు సంబంధించి 2026 అక్టోబర్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు పోషక ఆధారిత సబ్సిడీ (ఎన్‌బీఎస్) విధానాన్ని అమలు చేయనున్నారు. డీఏపీ, ఎన్‌పీకేఎస్ తదితర భాస్వరం, పొటాష్ ఎరువులకు ఈ సబ్సిడీ వర్తించనుంది. గత రబీ సీజన్‌తో పోలిస్తే ఈసారి సుమారు రూ.24,417 కోట్ల అదనపు నిధులను కేటాయించడం గమనార్హం.

రైతులకు సాగు ఖర్చుల నుంచి ఊరట

వ్యవసాయంలో ఎరువులు కీలకమైన ఇన్‌పుట్‌గా ఉన్నాయి. పంటల దిగుబడి, నాణ్యతపై ఎరువుల వినియోగం ప్రభావం చూపుతుంది. అయితే అంతర్జాతీయ మార్కెట్‌లో ఎరువుల ధరలు పెరిగినప్పుడు ఆ ప్రభావం నేరుగా రైతులపై పడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని అందించడం ద్వారా రైతులకు ఎరువులు అందుబాటు ధరల్లో లభించేలా చర్యలు చేపడుతోంది. రబీ సీజన్‌లో గోధుమలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటల సాగుకు ఈ నిర్ణయం తోడ్పడనుంది.

పలు కీలక నిర్ణయాలకు ఆమోదం

కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఎరువుల సబ్సిడీతో పాటు పలు ఇతర కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సూక్ష్మ పరిశ్రమలకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ కోసం రూ.5,000 కోట్లు, స్టాండ్ అప్ ఇండియా పథకానికి రూ.4,111 కోట్లను ఆమోదించారు. ఢిల్లీలో యుగే యుగీన్ భారత్ మ్యూజియం నిర్మాణానికి రూ.3,230 కోట్లు, నోయిడాగ్రేటర్ నోయిడా మెట్రో విస్తరణకు రూ.2,390 కోట్లు మంజూరు చేశారు. కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు

వాటర్ రెగ్యులేటరీ

మొదటిపేజీ తరువాయి

మంత్రి నిమ్మల రామానాయుడుతో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 ప్రాజెక్టులను రాబోయే రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షలో భాగంగా ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, నిర్వహణ, ఇరిగేషన్ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలోని సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టులన్నింటినీ జలహారతి కార్పొరేషన్ ద్వారా పర్యవేక్షించాలని సీఎం సూచించారు. దీనివల్ల వాటి నిర్వహణ, పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

అలాగే, విద్యుత్ రంగానికి ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఉన్న తరహాలోనే, జలవనరుల కోసం కూడా ప్రత్యేకంగా ఒక వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసే అంశంపై అధ్యయనం చేయాలని చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నిర్ణయాలతో సాగునీటి రంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు

మొదటిపేజీ తరువాయి

. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ ఎన్.రవికిరణ్ పాల్గొన్నారు.స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్‌కు ఈ గుర్తింపు లభించింది. నగరంలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, ఘన వ్యర్థాల శుద్ధి, మురుగునీటి నిర్వహణ, పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం తదితర అంశాల ఆధారంగా ఈ మూల్యాంకనం చేపట్టారు.హైదరాబాద్ నగరం గత కొన్నేళ్లుగా పారిశుధ్య రంగంలో పలు గుర్తింపులు సాధించింది. 2017లో ఓడీఎఫ్ హోదా పొందగా, 2019లో ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ గుర్తింపు సాధించింది. 2021లో తెలంగాణలో తొలిసారిగా వాటర్ ప్లస్ సర్టిఫికేషన్ పొందిన స్థానిక సంస్థగా జీహెచ్ఎంసీ నిలిచింది. 2023, 2024లోనూ ఈ హోదాను కొనసాగించింది. 2024 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పది లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో హైదరాబాద్ ఆరో ర్యాంకు సాధించింది.స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో మొత్తం 10,500 మార్కులతో పది ప్రధాన విభాగాల్లో నగరాల పనితీరును అంచనా వేశారు. పారిశుధ్యం, చెత్త వేరు చేయడం, ఇంటింటికీ చెత్త సేకరణ, ఘన వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్య సదుపాయాలు, మురుగునీటి నిర్వహణ, పారిశుధ్య కార్మికుల సంక్షేమం, పౌరుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇచ్చారు.

స్వచ్ఛ షెహర్ జోడీ కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ మంథని, చేర్యాల మున్సిపాలిటీలకు మెంటార్ సిటీగా వ్యవహరించింది. ఆయా పట్టణాల్లో పారిశుధ్య ప్రమాణాలను మెరుగుపరిచేందుకు శిక్షణ కార్యక్రమాలు, సామర్థ్య పెంపు వర్క్‌షాప్‌లు నిర్వహించింది.2026 ఏప్రిల్, మే నెలల్లో హైదరాబాద్ జంట నగరాల్లో మూడో పక్షం ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. పారిశుధ్య మౌలిక సదుపాయాలు, చెత్త నిర్వహణ, మురుగునీటి శుద్ధి, ఇంటింటి చెత్త సేకరణతో పాటు ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. జీహెచ్ఎంసీకి జాతీయ అవార్డు లభించడం నగర ప్రజలు, అధికారులు, పారిశుధ్య కార్మికులకు గర్వకారణమని అధికారులు పేర్కొన్నారు.

సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్ర దాడి

బైక్‌పై వచ్చి 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు

శ్రీనగర్, నవంబర్ 11 (ప్రజావినికిడి): :జమ్మూకశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ క్యాంపుపై ఉగ్రవాదులు దాడికి తెగబడ్డారు. ఓ ద్విచక్ర వాహనంపై దూసుకొచ్చిన ఇద్దరు ఉగ్రవాదులు.. భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఏకే47 తుపాకీతో 15 సెకన్లలో 30 రౌండ్ల కాల్పులు జరిపి పారిపోయారు. ఈ దాడిలో ముగ్గురు జవాన్లకు తీవ్రగాయాలవ్వగా.. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కుల్గాం జిల్లా మీర్‌బజార్ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద బుధవారం మధ్యాహ్నం 2.15 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దాడికి పాల్పడిన నిందితుల్లో ఒకరిని లష్కరే తోయిబాకు చెందిన విదేశీ ఉగ్రవాదిగా అనుమానిస్తున్నారు. బైక్ వచ్చి కాల్పులు జరుపుతూనే ఉగ్రవాదులు పారిపోయారని.. అప్రమత్తమైన జవాన్లు కూడా ఎదురు కాల్పులు జరిపారని ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. గాయపడిన ముగ్గురు జవాన్లలో ఇద్దరు కానిస్టేబుళ్లు, మరొకరు హెడ్ కానిస్టేబుల్ అని.. వారిని అనంతనాగ్‌లోని ఆస్పత్రికి తరలించామని వెల్లడించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. పారిపోయిన ఉగ్రవాదులను పట్టుకునేందుకు పెద్ద ఎత్తున సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు.

విజయసాయిరెడ్డి..కొత్త పార్టీ పీఆర్పీ

పరివర్తన రాజనీతి పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి
ఏపీ రాజకీయాల్లోకి మరో కొత్త వేదిక

అమరావతినవంబర్ 11 (ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో నూతన పార్టీ ఆవిర్భవించింది. మాజీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి తన కొత్త రాజకీయ పార్టీని అధికారికంగా ప్రకటించారు. పార్టీ పేరు 'పరివర్తన రాజనీతి పార్టీ' (పీఆర్పీ) అని ఆయన వెల్లడించారు. విజయవాడలో నిర్వహించిన సభలో వేదపండితుల ఆశీర్వచనాల నడుమ ఆయన పార్టీ పేరును ప్రకటించి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. జెండాను కాషాయ, తెలుపు రంగులతో రూపొందించారు. జెండా మధ్యలో ధర్మచక్రం గుర్తును ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరైన మద్దతుదారులు, అభిమానులతో విజయసాయిరెడ్డి 'పీఆర్పీ' అంటూ నినాదాలు చేయించారు. సభకు వచ్చిన కార్యకర్తలు 'జై శ్రీరామ్', 'విజయసాయిరెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అభిమానులు ఆయనను భారీ గజమాలతో ఘనంగా సత్కరించారు.రాష్ట్రంలో ప్రస్తుతం స్పష్టమైన రాజకీయ శూన్యత ఉందని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు.



అధికారంలో ఉన్న టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్సీపీ రెండింటి తీరుతో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఈ నేపథ్యంలో ప్రజలకు బలమైన ప్రత్యామ్నాయం అవసరమని భావించి కొత్త పార్టీని తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. రెండు పార్టీలు, రెండు కుటుంబాల రాజకీయ ఆధిపత్యానికి ముగింపు పలకడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. దేశభక్తి, ప్రజా సంక్షేమం, ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా తమ పార్టీ పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏపీని కేవలం రెండు కుటుంబాలు మాత్రమే పాలించాలా? అని ఆయన ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు వైసీపీ కీలక నేతగా పనిచేసిన విజయసాయిరెడ్డి, ఇప్పుడు సొంతంగా పార్టీని స్థాపించి ప్రత్యక్ష రాజకీయాల్లో సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు.వైసీపీలో తాను తీవ్ర అవమానాలను ఎదుర్కొన్నానని మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్పీ) అధినేత విజయసాయిరెడ్డి అన్నారు. విజయవాడలో తన పార్టీని ప్రకటించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వైసీపీని స్వచ్ఛందంగా వీడలేదని, తనను అవమానించి బలవంతంగా పార్టీ నుంచి బయటకు పంపించారని ఆయన స్పష్టం చేశారు.

వైసీపీలో ఉన్న సమయంలో తాను 70కి పైగా అవమానాలను భరించానని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మనిషి తట్టుకోలేని రీతిలో అక్కడ అవమానాలు జరిగాయని, ఆత్మగౌరవం దెబ్బతిన్న చోట ఎవరూ ఉండలేరని వ్యాఖ్యానించారు. వైసీపీ అధినేత జగన్ కొందరి చెప్పుడు మాటలు విని తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. పార్టీ కోసం ఎంతగానో శ్రమించిన తనను చివరకు అవమానకర రీతిలో బయటకు నెట్టారని పేర్కొన్నారు.

ఈ పరిణామాల నేపథ్యంలోనే సరికొత్త రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టినట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కీలక వ్యక్తులు, నాయకులు తమ కొత్త పార్టీలోకి చేరుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

మొదటిపేజీ తరువాయి

నిర్ణయించింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని మార్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంస్కరణల అమలులో ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి విద్యార్థులకు ప్రత్యేక విద్య అందించాలని సూచించారు.

విద్యార్థులకు 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ (స్కిల్లింగ్) అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం స్పష్టం చేశారు.

సంక్షేమం ఆగమైంది

మొదటిపేజీ తరువాయి

చూపుతోందని ఆరోపించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన రైతు గర్జన సభలో ఆయన మాట్లాడారు.

అన్ని వర్గాల ప్రజలకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టారని, ఉద్యోగులకు ఆరు నెలల్లో పీఆర్సీ ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. మూడేళ్ల పాలనలో ఏ వర్గానికి న్యాయం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. బీడీ పరిశ్రమకు అండగా నిలిచిన నాయకుడు కేసీఆర్ అని, నిర్మల్ జిల్లాలోనే 63 వేల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు అందించారని గుర్తుచేశారు.

రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని కేటీఆర్ విమర్శించారు. వరి పంటకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి హామీ నిలబెట్టుకోలేదన్నారు. మూడు విడతలుగా రైతుబంధు అందించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. రైతులకు నీళ్లు, కరెంటు అందకపోవడంతో వ్యవసాయం సంక్షోభంలో పడిందన్నారు.కేసీఆర్ పాలనలో 24 గంటల విద్యుత్, సమృద్ధిగా సాగునీటితో కళకళలాడిన తెలంగాణలో ప్రస్తుతం మళ్లీ చీకటి రోజులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పంటకు దుక్కి దున్నొద్దని, విత్తనాలు చల్లొద్దని ప్రభుత్వం రైతులతో స్వీయ ధ్రువీకరణ పత్రాలు రాయించడమేంటని ప్రశ్నించారు.

నిర్మల్ జిల్లాలో తొమ్మిది మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు. గోదావరి పరివాహక ప్రాంతం, ఎస్ఆర్ఎస్పీ వంటి ప్రాజెక్టులు ఉన్న జిల్లాలో కరువు రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. కడెం ప్రాజెక్టు కింద సాగునీరు నిలిపివేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు.

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు నిధులు కేటాయించకుండా వివక్ష చూపుతోందని విమర్శించారు. రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరుతూ ప్రధాని మోదీ ఇంటి ఎదుట బైఠాయించి ధర్నాలు చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎనిమిది మంది ఎంపీలు తెలంగాణకు న్యాయం జరిగేలా ఎందుకు పోరాడటం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నాయకులు జాన్సన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో మిగిలిన 23 పురపాలికల ఎన్నికల షెడ్యూల్ నేడు విడుదల

అమరావతినవంబర్ 11(ప్రజావినికిడి):

ఆంధ్రప్రదేశ్‌లో గతంలో వాయిదా పడిన 23 పట్టణ స్థానిక సంస్థలకు (యూఎల్‌బీ) ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పూర్తిస్థాయిలో సన్నద్ధమైంది. గురువారం (నవంబరు 12) మధ్యాహ్నం 12:30 గంటలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అధికారికంగా ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. దీంతో రాష్ట్రంలోని పలు కీలక నగరాలు, పట్టణాల్లో ఎన్నికల కోడ్ అమల్లోకి రానుంది.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థలు ఉండగా, వాటిలో 100 సంస్థలకు ఇప్పటికే ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. మిగిలిన 4 కార్పొరేషన్లు, 15 మున్సిపాలిటీలు, 4 నగర పంచాయతీలకు సంబంధించి హైకోర్టులో కేసులు పెండింగ్‌లో ఉండటంతో అక్టోబర్ 14న విడుదల చేసిన సాధారణ నోటిఫికేషన్‌లో వీటికి చోటు దక్కలేదు. ప్రస్తుతం వీటికి సంబంధించిన న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోవడం, వార్డుల పునర్విభజన మరియు రిజర్వేషన్ల ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేయడంతో ఎస్ఈసీ ఎన్నికల ప్రక్రియను ప్రారంభించనుంది.

నాలుగు కార్పొరేషన్ల రిజర్వేషన్ల వివరాలు

ఎన్నికలు జరగనున్న నాలుగు ప్రధాన కార్పొరేషన్లలో మొత్తం 260 డివిజన్లు ఉన్నాయి. వీటిలో బీసీలకు 90, ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, జనరల్ మహిళలకు 68, ఓపెన్ కేటగిరీకి 62 డివిజన్లు కేటాయించారు.

మేయర్ పదవుల రిజర్వేషన్లను పరిశీలిస్తే:

- శ్రీకాకుళం: బీసీ మహిళ (బీసీ జనరల్)
- కాకినాడ: బీసీ మహిళ
- రాజమహేంద్రవరం: ఎస్సీ (జనరల్)
- మంగళగిరితాడేపల్లి: ఎస్టీ

ఈ నాలుగు కార్పొరేషన్లతో పాటు మిగిలిన 19 పురపాలక సంస్థల పరిధిలో మొత్తం 749 వార్డులు ఉండగా, వాటిలో 174 వార్డులను ఓపెన్ కేటగిరీ కింద ఖరారు చేశారు.

ఎన్నికలు జరగనున్న పట్టణ సంస్థల జాబితా (ప్రాంతాల వారీగా):

ఉత్తరాంధ్ర: శ్రీకాకుళం కార్పొరేషన్ (60 డివిజన్లు), ఆమదాలవలస మున్సిపాలిటీ (శ్రీకాకుళం జిల్లా), రాజాం మున్సిపాలిటీ (విజయనగరం జిల్లా).

గోదావరి ఏలూరు పరిధి: కాకినాడ కార్పొరేషన్ (66 డివిజన్లు), రాజమహేంద్రవరం కార్పొరేషన్ (72 డివిజన్లు), పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు మున్సిపాలిటీలు (పశ్చిమ గోదావరి జిల్లా), చింతలపూడి నగర పంచాయతీ (ఏలూరు జిల్లా).

కృష్ణా గుంటూరు పల్నాడు పరిధి: మంగళగిరితాడేపల్లి కార్పొరేషన్ (62 డివిజన్లు), పొన్నూరు మున్సిపాలిటీ (గుంటూరు జిల్లా), గుడివాడ మున్సిపాలిటీ (కృష్ణా జిల్లా), వైఎస్ఆర్ తాడిగడప మున్సిపాలిటీ (ఎన్టీఆర్ జిల్లా), నరసరావుపేట మున్సిపాలిటీ (పల్నాడు జిల్లా), బాపట్ల మున్సిపాలిటీ (బాపట్ల జిల్లా).

ప్రకాశం నెల్లూరు పరిధి: కందుకూరు మున్సిపాలిటీ, పొదిలి నగర పంచాయతీ (ప్రకాశం జిల్లా), కావలి మున్సిపాలిటీ, అల్లూరు నగర పంచాయతీ (ఎస్పీఎస్ నెల్లూరు జిల్లా).

రాయలసీమ పరిధి: గూడూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు (తిరుపతి జిల్లా), బి. కొత్తకోట నగర పంచాయతీ (అన్నమయ్య జిల్లా).

ఎన్నికల కమిషనర్ నిర్వహించే మీడియా సమావేశంలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ గడువులతో పాటు పోలింగ్, కౌంటింగ్ తేదీల వివరాలు అధికారికంగా వెల్లడి కానున్నాయి. దీర్ఘకాలంగా పాలకవర్గాలు లేని ఈ పురపాలక సంఘాల్లో ఎన్నికల ప్రకటన వెలువడనుండటంతో స్థానికంగా రాజకీయ సందడి మొదలైంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

గురువారం 12 నవంబర్ 2026

బాచుపల్లి శివాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన బిక్ష ప్రారంభం..

మొదటి రోజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్



కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి): అయ్యప్ప స్వాముల సేవే లక్ష్యంగా బాచుపల్లి శివాలయం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో మొదటి రోజు అన్నదాన బిక్ష కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సన్నిధానంలో అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నదాన బిక్షను ప్రారంభించి అయ్యప్ప స్వాములకు స్వయంగా భోజనం వడ్డించారు.అయ్యప్ప దీక్ష కొనసాగించే కాలమంతా ప్రతిరోజూ స్వాములకు మధ్యాహ్న బిక్ష అందించాలనే సంకల్పంతో ఆగం పాండు ముదిరాజ్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు.గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తూ, అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు సన్నిధానంలో ఆశ్రయం కల్పిస్తూ,వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. ఆగం పాండు ముదిరాజ్ చేస్తున్న ఈ సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.తండ్రి బాటలో తనయుడు..తండ్రి అడుగుజాడల్లో తనయుడు అన్నట్లుగా ఆగం పాండు ముదిరాజ్ కుమారుడు ఆగం కిరణ్ కుమార్ ఈ ఏడాది తొలిసారిగా అయ్యప్ప మాలధారణ చేసి కన్యస్వామిగా దీక్షను ప్రారంభించారు. భక్తి, సేవాభావంతో కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వాముల సేవలో భాగస్వాములు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అయ్యప్ప స్వాముల దీక్షా కాలమంతా ఈ సన్నిధానంలో అన్నదాన బిక్ష కార్యక్రమం కొనసాగనుండటంతో స్వాములు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంక్షేమమే ప్రథమ ప్రాధాన్యం

: బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్,(ప్రజావినికిడి): కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు కుత్బుల్లాపూర్ సంక్షేమ ప్రదాత, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేయగా సానుకూలంగా స్పందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,కుత్బుల్లాపూర్ ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ప్రథమ కర్తవ్యంగా పనిచేస్తున్నాం అని అన్నారు

రూ లక్ష 60 వేలు ఆరోగ్య మిత్ర ఉద్యోగినికి ఆరోగ్యశ్రీ ఉద్యోగులు ఆర్థిక సహాయం అందజేత

హైదరాబాద్, (ప్రజావినికిడి):



ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్ ఆరోగ్య మిత్ర హైమావతి మరణించడం జరిగింది.ఆమె మరణంతో తోటి ఆరోగ్యశ్రీ ఉద్యోగులు పెద్ద ఎత్తున కుటుంబానికి అండగా నిలబడి లక్ష 60 వేల రూపాయలు ఆమె భర్త శ్రీనివాసు, కూతుర్లు అశ్విత,అనునితకు హైదరాబాద్ వారి నివాసములో ఆర్థిక సహాయం అందచేయడం జరిగింది. ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ జనరల్ మేనేజర్ నరేష్ కుమార్, హైదరాబాద్ డిస్టిక్ మేనేజర్ పాషా,టీం లీడర్స్,రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆరోగ్య మిత్రాలు వారికి తోచిన సహాయాన్ని చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.

ప్రభుత్వం 20 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వాలి : గిరి యాదయ్య రాష్ట్ర అధ్యక్షులు

ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్టులో దాదాపు రెండు దశాబ్దాలుగా పని చేసిన ఆరోగ్య మిత్రాలు వివిధ కారణాలతో చనిపోతున్నారు. కనీసం చనిపోయిన తర్వాత వారి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే చాలామంది ఆరోగ్య మిత్రలు చాలా కారణాలతో చనిపోవడం జరిగింది. ఇకనైనా ప్రభుత్వం, ఆరోగ్యశ్రీ ట్రస్టు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి హైమావతి కుటుంబంతో పాటు ఈ మధ్యకాలంలో చనిపోయిన ఆరోగ్య మిత్రల కుటుంబాల అందరికీ తక్షణమే 20 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని ఆరోగ్యశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ రాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ సుమన్,వర్కింగ్ ప్రెసిడెంట్ విష్ణు, ఉపాధ్యక్షులు కిషోర్,టీం లీడర్ సంతోష్,ఆరోగ్య మిత్రాలు సునీత, సరస్వతి, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విద్యా భాండాగారాలు

పుస్తక పఠనం ద్వారా ప్రతీ ఒక్కరూ జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లైబ్రరీ ప్రారంభోత్సవంలో బిఆర్ఎస్ ఎల్పీవిప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్





కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):
జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని 132-జీడిమెట్ల డివిజన్ కుత్బుల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన పాఠశాల గ్రంథాలయాన్ని బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,స్కూల్ విద్యార్థులు మొబైల్ ఫోన్లలో సమయాన్ని వృధా చేసుకోకుండా పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాల ఏర్పాటు ద్వారా విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు.
విద్యాభ్యాసంలో ఆసక్తి ఉండి పేదరికంతో విద్యకు దూరమవుతున్న విద్యార్థులను ప్రోత్సహించి వారు విద్యాభ్యాసాన్ని కొనసాగించేలా వారి తల్లిదండ్రులకు విద్య అవసరాన్ని తెలియజేసేలా పాఠశాల ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు
కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించేలా మన నియోజకవర్గంలోనే తన సొంత నిధులతో ఇంటర్మీడియట్, ఒకేషనల్,డిగ్రీ కళాశాలలను నిర్మించడం జరిగిందని నిరుపేద విద్యార్థులు ఈ కళాశాలలను వినియోగించుకొని ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత శిఖరాలను చేరాలన్నారు.
ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, సెక్రెటరీ వసుంధర, పాఠశాల ప్రిన్సిపాల్ కమల్ సింగ్,స్థానిక సంక్షేమ సంఘాల నాయకులు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సెలవును విజయవంతం చేయాలి



వాజేడు,నవంబర్ 11,(ప్రజావినికిడి): తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూషనరీ పెన్షన్స్ ఎంప్లాయిస్ యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 17వ తేదీన ములుగు జిల్లా కేంద్రంలో తలపెట్టిన సామూహిక సెలవు ధర్మదీక్షను విజయవంతం చేయాలని సిపిఎస్ జిల్లా అధ్యక్షులు అన్నవరం రవికాంత్ పిలుపునిచ్చారు. వాజేడు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కంట్రీబుషనరీ పెన్షనర్స్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సిపిఎస్ విధానంలో ఉద్యోగులందరూ నష్టపోతున్నారని పదవి విరమణ తర్వాత కనీస అవసరాలు తీర్చుకోలేకపోతున్నారని వారందరిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్ తరానికి అలాంటి ఇబ్బంది రాకుండా ఉండేందుకు సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని అన్నారు

మేనిఫెస్టో అమలు చేయాలి :గుల్ల గట్టు సంజీవ రాష్ట్ర కార్యదర్శి

కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో సిపిఎస్ ని రద్దు చేసి ఓపిఎస్ ను పునరుద్ధరిస్తామని చెప్పిన విధంగా మాట నిలబెట్టుకోవాలని సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి గుల్లగట్టు సంజీవ అన్నారు. ప్రస్తుతం ఉన్న పెన్షన్ విధానంలో 30 సంవత్సరాలు సర్వీస్ చేసినా ఉద్యోగి 3 వేల రూపాయలు పెన్షన్ గా పొందుతున్నాడని దీనివలన కనీస అవసరాలు తీర్చుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల కన్నా ప్రభుత్వ ఉద్యోగులకు వచ్చే పెన్షన్ తక్కువగా ఉందని పేరుకే ప్రభుత్వ ఉద్యోగం అని రిటైర్ అయ్యాక పట్టించుకునే వారు లేరని అందుకే ప్రభుత్వం ఉద్యోగుల యొక్క అవసరాలను దృష్టిలో ఉంచుకొని పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సంజీవ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 17న జరిగే సామూహిక సెలవుతో ఉద్యోగుల ఐక్యతను చాటి చెప్పాలన్నారు.
ఈ కార్యక్రమంలో వాజేడు మండలం విద్యాధికారి వెంకటేశ్వరరావు సిపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు నాగేశ్వరరావు జిల్లా మహిళా అధ్యక్షురాలు వనజ వాజేడు మండలం అధ్యక్షులు స్వరూప్ సింగ్ జేఏసీ నాయకులు సిందే రాజేష్ కరటూరి సతీష్ కుమార్, బాలాజీ,రంగు ఆనంద్,ప్రభాకర్, రవి,శ్రీకాంత్ వైశ్య తదితరులు పాల్గొన్నారు


త్రాగునీరు ప్రవహించిన వాగులో విషపు నురగలు కక్కుతున్న కాలుష్యం నీరు..

ఫరుక్ నగర్,నాగులపల్లి మధ్య వాగు దుస్థితి..


సంబంధిత శాఖ అధికారులు పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు డిమాండ్..







ఫరూక్ నగర్ రెవిన్యూలో వాగులో వెలసిన వెంచర్



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలోని బొడంపాడు గ్రామ చెరువు నుండి ప్రారంభమయ్యే వాగు నీటి ప్రవాహం..

షాద్ నగర్,(ప్రజావినికిడి):
షాద్ నగర్ నియోజకవర్గం లోని మొగిలిగిద్ద,కుర్వగుడ గ్రామాల పరిధిలో ప్రవహిస్తూ ఎలికట్ట గ్రామంలోని లాడెన్ చెరువు, మీదుగా వాగు నీటి ప్రవాహం ఫరూక్ నగర్ లోని బొబ్బిలి చెరువును నింపుతూ, నాగులపల్లి లింగారెడ్డిగూడ గ్రామాల మధ్య వాగు నీటి ప్రవాహం గతంలో స్వచ్ఛమైన నీటితో ప్రవహించే వాగు నేడు కలుషితల జలాలతో తెల్లటి నురగలు కక్కుతూ,దుర్వాసన వెదజల్లుతూ పరిసరాల వ్యవసాయ భూములపై ఈ నీటి ప్రభావం పడుతుందన్నారు.ఈ సందర్భంగా టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే బక్కాని నరసింహులు మాట్లాడుతూ,మా చిన్నతనంలో నాగులపల్లి లింగారెడ్డిగూడ గ్రామాల మధ్యన చందోని మోదుగులలో ఆదివారం సెలవు రోజున పశువులను మేపుటకు వెళ్లిన సమయంలో ఈ వాగు నీరే త్రాగి జీవనం సాగించిన రోజులను గుర్తు చేసుకున్నారు. ఫరూక్నగర్ శివారులో వాగున డైవర్షన్ చేసి వెంచర్ నిర్మాణం చేపట్టడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.నేడు అభివృద్ధి పేరుతో ఎలికట్ట లో డాటా సెంటర్ ల నిర్మితము, మరోపక్క ఇరిగేషన్ శాఖ అధికారులు ఇష్టానుసారంగా అడిగిన ప్రతివారికి ఎన్ఓసీలు జారీ చేస్తూ,వాగును బ్రష్టు పట్టిస్తున్న వైనం కళ్ళకు కట్టినట్టు కనబడుతుందన్నారు.రెవిన్యూ ఇరిగేషన్ శాఖ అధికారులు ఎన్ఓసీలు జారీ చేసే సమయంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి వాస్తవిక పరిస్థితులను,
భవిష్యత్తును పరిగణలోకి తీసుకోవాలని రాబోవు తరాలకు ఇబ్బందులు ఏర్పడకుండా ఎన్వోసీలు జారీలు చేయాలి సూచించారు.

బోడంపాడు గ్రామం నుండి మొదలుకున్న వాగుపై అనేక ఆక్రమణలు,

కాలుష్యకార పరిశ్రమలు నిర్మితమయ్యాయని తద్వారా వాగులో ప్రవహించే కలుషిత నీరు పశువుల త్రాగి అనారోగ్యం బారిన పడి మృతి చెందిన సంఘటనలు అనేకం ఉన్నాయి అన్నారు.సంబంధిత పొల్యూషన్ బోర్డు అధికారులు స్పందించి వాగుపై అక్రమంగా నిర్మితమైన కాలుష్యకార కంపెనీలను పరిశీలించాలన్నారు.ఇరిగేషన్ శాఖ అధికారులు వాగుకు అనుకొని నిర్మితమవుతున్న డాటా సెంటర్ లను క్షేత్రస్థాయి పరిశీలన చేసి ఆక్రమణలకు గురైతే చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ వాగు గుండ ప్రవహించే నీరు వివిధ గ్రామాల చెరువులను నింపుతూ హైదరాబాద్ సమీపంలోని హిమాయత్ సాగర్ కు చేరుతుందన్నారుతద్వారా సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి మెదక్ పార్లమెంట్ అధ్యక్షుడు ఇల్లెందుల రమేష్,ఫరూక్ నగర్ మాజీ సింగిల్ విండో చైర్మన్ అన్మారి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

కృత్రిమ మేధస్సుదే భవిష్యత్..

యువత ఏఐ నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి:ఫాదర్ థామస్ శాంటియాగో

డాన్ బాస్కో ఏఐ అకాడమీ ప్రారంభం.. సార్క్-టెక్ భాగస్వామ్యంతో అంతర్జాతీయ స్థాయి శిక్షణ





రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): నవంబర్11, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకోవడమే భవిష్యత్తులో యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలకు మార్గమని ఫాదర్ థామస్ శాంటియాగో అన్నారు.మెట్రో నగరాలతో పాటు ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల విద్యార్థులకు సైతం అంతర్జాతీయ స్థాయి ఏఐ ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో డాన్ బాస్కో ఏఐ అకాడమీని ప్రారంభించినట్లు వెల్లడించారు. బండ్లగూడ జాగీర్‌లోని కిస్మత్‌పూర్ డాన్ బాస్కో ప్రావిన్షియల్ హౌస్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అకాడమీని అధికారికంగా ప్రకటించి, సంబంధిత బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రముఖ ఏఐ శిక్షణ సంస్థ సార్క్-టెక్ భాగస్వామ్యంతో ఈ అకాడమీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. హైదరాబాద్‌ను ప్రధాన కేంద్రంగా చేసుకుని విద్యార్థులకు ఆధునిక ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆంగ్ల సంభాషణ నైపుణ్యాలు, ఇంటర్వ్యూ శిక్షణ,ఉపాధి అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు వివరించారు. ఈ అకాడమీలో భాగంగా 'ఏఐ ఫర్ నాన్-ఏఐ పీపుల్' పేరుతో 30 గంటల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.కామర్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, సైన్స్ విద్యార్థులకు కోడింగ్ అవసరం లేకుండానే ప్రాంప్టింగ్, జనరేటివ్ ఏఐ టూల్స్,స్టార్టప్ పిచ్‌లపై శిక్షణ అందించనున్నారు.అదేవిధంగా కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం 40 గంటల పాటు 'జెంటిక్ ఏఐ ఫర్ సీఎస్ స్టూడెంట్స్' కోర్సు ద్వారా ఏఐ ఏజెంట్ల రూపకల్పన, డిప్లాయ్‌మెంట్‌పై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఉపాధ్యాయులు, మహిళా పారిశ్రామికవేత్తలు,స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యువత కోసం రాబోయే 90 రోజుల్లో పది ఆఫ్‌లైన్ బూట్‌క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్పొరేట్,స్టార్టప్ రంగాలకు చెందిన 15 మంది నిపుణులతో మెంటార్ ప్యానెల్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి విద్యార్థికి డిజిటల్ జాబ్-రెడీనెస్ పాస్‌పోర్ట్ అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాన్ బాస్కో ఏఐ అకాడమీ డైరెక్టర్ ఫాదర్ శరత్,బర్డి రెక్టర్ ఫాదర్ నోయల్ మాదిశెట్టి,అప్లైడ్ ఏఐ మెంటార్ డాక్టర్ మహేష్ కుమార్,సార్క్ డైరెక్టర్ లీన ఇరుదయ మేరీ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు, ఉచిత దరఖాస్తుల కోసం 8977005126 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.



అయ్యప్ప స్వామి నూతన సన్నిధానం నిర్మాణానికి రూ.35 వేల విరాళం అందించిన బీఆర్ఎస్ నేత వై.రవీందర్ యాదవ్



షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజకవర్గంలోని ఫరూఖ్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని హనుమాన్ దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి సన్నిధానం అభివృద్ధికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్గనమోని రవీందర్ యాదవ్ తన వంతు సహకారం అందించారు.నూతన సన్నిధానంలో ఫ్లోరింగ్ బండల ఏర్పాటు కోసం రూ.35,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించడం అభినందనీయమని గ్రామస్తులు, అయ్యప్ప స్వామి భక్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రవీందర్ యాదవ్‌కు గ్రామస్తులు, అయ్యప్ప స్వామి భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.అయ్యప్ప స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బుగ్గ కృష్ణ,గ్రామ బీఆర్ఎస్ నాయకులు,అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల ఆర్టీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.

ఎంపీ,ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వినతి



షాద్ నగర్,(ప్రజావినికిడి):డిగ్రీ కళాశాలలకు సంబంధించిన ఆర్టీఎఫ్ (రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజు),స్కాలర్‌షిప్‌ల గత మూడేళ్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ టీపీజేఎం రాష్ట్ర అధ్యక్షుడు,చైర్మన్ గౌరీ సతీష్, చేవెళ్ల ఇన్‌చార్జి భీమ్ భరత్, తెలంగాణ గ్రాడ్యుయేట్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.కరుణాకర్ ప్రభుత్వ సలహాదారు,రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా డిగ్రీ కళాశాలలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను, ముఖ్యంగా గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీఎఫ్, స్కాలర్‌షిప్ బకాయిల వల్ల కళాశాలల నిర్వహణపై పడుతున్న భారాన్ని ఆయనకు వివరించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం పెండింగ్ బకాయిలను త్వరితగతిన విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మైనారిటీ సంక్షేమ అభివృద్ధికి రూ.2 కోట్ల అదనపు నిధులు మంజూరు చేయాలి

మంత్రి అజారుద్దీన్‌కు వినతిపత్రం అందజేసిన షాద్‌నగర్ మైనారిటీ నాయకులు

షాద్‌నగర్,(ప్రజావినికిడి):
నియోజకవర్గంలో మైనారిటీల సంక్షేమం,అభివృద్ధి కార్యక్రమాల కోసం అదనంగా రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను నాయకులు కోరారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచన మేరకు నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలోని మైనారిటీ సంక్షేమ శాఖకు సంబంధించిన పలు సమస్యలు, పెండింగ్ అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



ముఖ్యంగా నియోజకవర్గ పరిధిలో ఇప్పటికే ఉన్న నాలుగు ఉర్దూ ఘర్ కమ్ షాదీఖానాల మరమ్మతులు, పునరుద్ధరణ పనులతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అదనపు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. మైనారిటీ సంక్షేమ శాఖ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరు చేస్తే పనులను పూర్తిస్థాయిలో చేపట్టి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించగలమని మంత్రికి వివరించారు. అదేవిధంగా ఉర్దూ పాఠశాలల అభివృద్ధితో పాటు మైనారిటీల సంక్షేమానికి సంబంధించిన ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కూడా నిధులు కేటాయించాలని కోరారు.ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ మాట్లాడుతూ, షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన రూ.2 కోట్ల నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం మాట్లాడుతూ, మైనారిటీల అభివృద్ధికి మైనారిటీ కార్పొరేషన్ ద్వారా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు.
మైనారిటీ వర్గాలకు విద్య,మౌలిక సదుపాయాలు,సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం,మైనారిటీ కార్పొరేషన్ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా ఖత్వాల్‌ను కూడా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధి, మైనారిటీల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇబ్రహీం,ఫయూమ్,కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ ఖదీర్, మహమ్మద్ ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

శ్రామిక బడి విద్యార్థులకు స్టీల్ భోజన ప్లేట్ల పంపిణీ



షాద్‌నగర్,(ప్రజావినికిడి):పట్టణంలోని ఐదో వార్డు ఎంపీ శేఖయ్య నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్న శ్రామిక బడి విద్యార్థులకు స్టీల్ భోజన ప్లేట్లను పంపిణీ చేశారు.పౌల్ట్రీ రైతు మండవ మురళి సహకారంతో పౌల్ట్రీ పారిశ్రామికవేత్త పాతూరి వెంకటరావు విద్యార్థులకు ప్లేట్లను అందజేశారు. షాద్‌నగర్ ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా పౌల్ట్రీ పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల పిల్లలను గుర్తించి సుమారు 70 మంది విద్యార్థుల కోసం ప్రత్యేకంగా శ్రామిక బడిని ఏర్పాటు చేశారు. పాతూరి వెంకటరావు పౌల్ట్రీ కమ్యూనిటీ హాల్‌లోనే విద్యార్థులకు విద్యాబోధన అందించేలా సహకరించడమే కాకుండా,విద్యా వాలంటీర్‌కు స్వయంగా వేతనం కూడా అందిస్తున్నారు.ఈ క్రమంలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా మండవ మురళి సహకారంతో స్టీల్ ప్లేట్లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కార్మిక నేత పినపాక(ప్రభాకర్,ఉపాధ్యాయులు సత్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వైఫల్యాల వల్లే ఎండిన వరి వంటలు..

మాహమ్మదబాద్,గండెడ్,హన్వాడ మండలాలలో బీఆర్ఎస్ నేతల పర్యటన

పర్యటనలో పాల్గొన్న:మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి





పరిగి,(ప్రజావినికిడి):కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలలో భాగంగా విద్యుత్ సరఫరా అందక వరి చేలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,అదేవిదంగా పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి తీవ్రంగాధ్వజమెత్తారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం మాహమ్మద బాద్,గండెడ్ అలాగే మహ బూబ్ నగర్ నియోజకవర్గం హన్వాడ మండలాలలో ఎండిపోయిన వరి పంటలను బుధవారం బీఆర్ఎస్ నేతల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి,నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,గత బీఆర్ఎస్ పాలనలో రైతులకు పుష్కలంగా విద్యుత్ అంది పంటలు కళకళలాడాయని,కానీ ప్రస్తుత కాంగ్రెస్ రైతు విరుద్ధ పాలన వల్ల కళ్లముందే పంటలు ఎండిపోతుంటే రైతాంగం తీవ్ర ఆవేదన చెందుతోందని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఎండిపోయిన పంట పొలాలను సర్వే చేయించి నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు తగిన పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్యుత్ సరఫరా లోపంతో చేతికందిన పంటలు ఎండాయని వాపోయిన రైతన్నలు..

వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ సరఫరా అందకపోవడం,తీవ్రమైన లో-వోల్టేజీ సమస్యల వల్ల ఆరుగాలం కష్టపడి పెంచిన పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అప్పులు తెచ్చి, రాత్రింబవళ్లు కష్టపడి సాగు చేసిన వరి పంట పొట్ట దశకు వచ్చాయని,సరిగ్గా ఈ సమయంలోనే కరెంట్ కోతలు విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. రోజుకు కనీసం 4 నుండి 5 గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ రావడం లేదని,వచ్చిన కొద్దిసేపు కూడా వోల్టేజీ సరిగ్గా లేకపోవడంతో బోర్ల మోటార్లు,ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని వారు వాపోతున్నారు.కరెంట్ ఎప్పుడు వస్తుందో తెలియక అర్ధరాత్రిళ్లు కూడా పొలాల వద్దే పడిగాపులు కాస్తున్నామని,బోర్లలో నీళ్లున్నా విద్యుత్ లోపంతో పంటను తడుపుకోలేక పోతున్నామని తెలిపారు.



బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ హౌస్ అరెస్ట్

నవంబర్ 11: (ప్రజావినికిడి):

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హనుమకొండ పర్యటన నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ సీనియర్ నేత దాస్యం వినయ్ భాస్కర్‌ను ఈ ఉదయం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హనుమకొండ వడ్డేపల్లిలోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు, ఆయన బయటకు రాకుండా నిర్బంధించారు.కాజీపేట పరిధిలోని వైఎస్సార్ నగర్ నివాసితులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే డిమాండ్‌పై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనను అడ్డుకుంటామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ క్రమంలో వినయ్ భాస్కర్ స్పందిస్తూ... "వైఎస్సార్ నగర్ గుడిసెవాసులకు న్యాయం చేయకపోతే భట్టి పర్యటన అడ్డుకుంటాం. పట్టాలపై స్పష్టమైన ప్రకటన చేయాలి.. లేదంటే నిరసన తప్పదు" అని స్పష్టం చేశారు.ఈ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. వినయ్ భాస్కర్ ఇంటి వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు, స్థానికంగా ఉన్న పలువురు బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలను కూడా ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

చిరు వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి పీఎం స్వానిధి పథకం దోహదం: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసాపై అవగాహన సదస్సు





రాజేంద్రనగర్, (ప్రజావినికిడి): నవంబర్ 11,
చిరు వ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెంది స్వయం సమృద్ధి సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం స్వానిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ సూచించారు. వీధి వ్యాపారులకు అండగా నిలిచి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) రాజేంద్రనగర్ జోన్ అత్తాపూర్ సర్కిల్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని ప్రైడ్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన పీఎం స్వానిధి మహోత్సవ్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకునేందుకు పీఎం స్వానిధి పథకం ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. డిజిటల్ లావాదేవీలపై అవగాహన పెంచుకుని ఆధునిక విధానాలను అనుసరించాలని కోరారు. చిరు వ్యాపారులకు ప్రభుత్వాలు అందిస్తున్న సహకారం వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ అధికారులు, పెద్ద సంఖ్యలో వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

మక్కాలో వివాహ వేడుక..

ఉమ్రా యాత్రకు ఒకే కుటుంబానికి చెందిన 25 మంది

హైదరాబాద్ నుంచి 60 మంది బృందంగా బయలుదేరిన యాత్రికులు

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దు.. అల్మిజాన్ ట్రావెల్స్ ఎండీ ఫయాజ్ అలీ





శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 11,
ఉమ్రా యాత్రలో అరుదైన విశేషం చోటుచేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఒకే కుటుంబంలో 25 మంది ఉమ్రా యాత్రకు బయలుదేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మొత్తం 60 మంది యాత్రికులతో కూడిన బృందంలో ఒకే కుటుంబానికి చెందిన 25 మంది ఉండటం విశేషం. మక్కాలో వివాహ వేడుక నిర్వహించాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులంతా కలిసి పవిత్ర యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా అల్మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ఉమ్రా యాత్రకు సంబంధించి వస్తున్న తప్పుడు ప్రచారాల కారణంగా పలువురు యాత్రకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం ఉమ్రా యాత్రకు సంబంధించిన పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే నిరాధార ప్రచారాలను నమ్మి భక్తులు తమ పవిత్ర యాత్రలను రద్దు చేసుకోవద్దని ఆయన సూచించారు. ఉమ్రా యాత్రకు వెళ్లాలనుకునే వారు అందోళన చెందకుండా సరైన సమాచారం తెలుసుకుని తమ ప్రయాణాలను కొనసాగించాలని కోరారు. ఒకే కుటుంబానికి చెందిన 25 మంది కలిసి ఉమ్రా యాత్రకు వెళ్లడం కుటుంబ సభ్యుల్లో ఆనందోత్సాహాలను నింపిందని పేర్కొన్నారు.

ఎంఎస్ఎన్ కంపెనీలో సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన

సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి..

నందిగామ సిఐ వీరబాబు..



షాద్ నగర్,(ప్రజావినికిడి): నియోజకవర్గంలోని నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఎస్ఎన్ కంపెనీలో సైబర్ నేరాల నివారణ, డిజిటల్ భద్రతపై నందిగామ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది కంపెనీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ అరెస్ట్ మోసాలు, మ్యూల్ బ్యాంక్ ఖాతాలు, సిమ్ కార్డుల దుర్వినియోగం, కంపెనీ ఉన్నతాధికారుల పేరుతో జరిగే ఆన్‌లైన్ మోసాలపై పోలీసులు వివరించారు. అపరిచితులకు ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు వెల్లడించకూడదని, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని, గుర్తుతెలియని ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు. అలాగే సైబర్ నేరగాళ్లకు తమ బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డులను వినియోగించుకునే అవకాశం కల్పిస్తే చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ ఆర్థిక మోసాలకు గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఉద్యోగులకు సైబర్ భద్రతపై అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ వీరబాబు, ఎస్ఐ సుశీల, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారతదేశ ఐక్యత, ఆత్మగౌరవానికి సైనికుల త్యాగాలే ప్రతీక..

చిన్న జీయర్ స్వామి

దేశానికి విశిష్ట సేవలందించిన 70 మంది సైనికులకు, రక్షణ శాస్త్రవేత్తలకు ఘన సత్కారం



శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 11,
దేశ రక్షణలో సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని, దేశ భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని శ్రీ చిన్న జీయర్ స్వామి అన్నారు. ముచ్చింతల్‌లో నిర్వహిస్తున్న యతీంద్ర సప్తతి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు దేశానికి విశిష్ట సేవలందించిన 70 మంది సైనిక సిబ్బంది, రక్షణ రంగ శాస్త్రవేత్తలను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ సర్ కార్యవాహ శ్రీ భయ్యాజీ జోషి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైనికులు, ఆపరేషన్ సమయంలో వీరమరణం పొందిన ఆరుగురు సైనికుల కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా సత్కరించారు. కార్గిల్ యుద్ధ వీరుడు, పరమ వీర చక్ర పురస్కార గ్రహీత యోగేంద్ర సింగ్ యాదవ్, గ్రూప్ కెప్టెన్ కె. నచికేతతో పాటు అగ్ని, బ్రహ్మోస్ వంటి క్షిపణి కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషించిన సుమారు 25 మంది రక్షణ శాస్త్రవేత్తలను గౌరవించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన సైనికులు, శాస్త్రవేత్తల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. దేశానికి అంకితభావంతో సేవ చేసిన వీరులను సత్కరించడం గర్వకారణమని పేర్కొన్నారు. భిన్న మతాలు, కులాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశం ఐక్యతతో ముందుకు సాగుతోందని తెలిపారు. ఇతర దేశాలపై ఆధిపత్యం ప్రదర్శించడం భారతీయ సంస్కృతి కాదని, ప్రపంచ శాంతి, సమానత్వం, మానవతా విలువలకు భారత్ ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. అయితే దేశ భద్రతకు ముప్పు కలిగించే దుష్ట ప్రయత్నాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆపరేషన్ సిందూర్ భారతదేశ సంకల్ప బలానికి నిదర్శనమని వివరించారు.

